క్లుప్తంగా

రేపు మామిడి రైతులకు అవగాహన సదస్సు

రాజంపేట రూరల్ : ఉద్యానశాఖ ఆధ్వర్యంలో 19వ తేదీ ఉదయం 10 గంటలకు మామిడిలో పూత, పిందె దశలో చేపట్టాల్సిన సస్యరక్షణ, ఫ్రూట్ కవర్స్ వినియోగం, మార్కెటింగ్‌పై రైల్వేకోడూరు వద్దనున్న అనంతరాజుపేట ఉద్యాన కళాశాల ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాజంపేట, రైల్వేకోడూరు ఉద్యాన అధికారులు జి.సురేష్ బాబు, ఎం.వెంకటభాస్కర్‌లు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఒక రోజు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమంలో రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలలోని రైతులు పాల్గొనాల్సిందిగా కోరారు.

నలుగురు విద్యార్థులు గైర్హాజరు

చిట్వేలి : మండల కేంద్రమైన చిట్వేలిలో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏ సెంటర్‌లో 242 మంది, బీ సెంటర్‌లో 235 మంది, సీ సెంటర్‌లో 160 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు ఏ సెంటర్‌లో ఇద్దరు, బి సెంటర్‌లో ఇద్దరు గైర్హాజరైనట్లు ప్రధానోపాధ్యాయులు ఏబీఎన్ ప్రసాద్ తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.

పుల్లంపేట : మండల వ్యాప్తంగా సోమవారం జరిగిన పదోతరగతి పరీక్షలలో ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ నాగా తిరుమలరావు తెలిపారు. ఎస్‌బీవీడీ సభా హైస్కూల్, ఏపీ ఆదర్శ పాఠశాలలలో ఉదయం 9:30 గంటలకు పరీక్షలు ప్రారంభమయ్యాయని, 376 మంది విద్యార్థులకు గాను 374 మంది హాజరయ్యారని ఆయన తెలియజేశారు.

పరామర్శ



రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఈశ్వరయ్యను పరామర్శిస్తున్న ఆకేపాటి, పోలా

రాజంపేట టౌన్ : పట్టణంలోని బోయపాళానికి చెందిన రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ ఎస్.ఈశ్వరయ్య ఇటీవల బైక్‌లో వెళుతుండగా బైక్ అదుపు తప్పి కిందపడటంతో కాలు విరిగింది. దీంతో కుటుంబ సభ్యులు తిరుపతిలోని ఓ కార్పొరేట్ హాస్పిటల్‌లో వైద్యం చేయించారు. ప్రస్తుతం తన స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఈశ్వరయ్యను సోమవారం రాత్రి ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసరెడ్డిలు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితి గురించి ఈశ్వరయ్యను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోవిందు బాలకృష్ణ, జీవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏయూలో వీఎల్ఎస్ఐ డిజైన్‌లపై గెస్ట్ లెక్చర్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాజంపేట : అన్నమాచార్య విశ్వవిద్యాలయం ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం సోమవారం వీఎల్ఎస్ఐ డిజైన్ కాన్సెప్ట్‌లపై గెస్ట్ లెక్చర్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీవైభవ్, మేనేజర్, వీఎల్ఎస్ఐ గురు, బెంగుళూరు, వి.శ్రీకాంత్‌కుమార్, ఫిజికల్ డిజైన్ ఇంజనీర్, వీఎల్ఎస్ఐ బెంగుళూరు హాజరై విద్యార్థులతో మాట్లాడారు. వారు ముఖ్యంగా చిప్ అభివృద్ధి ఇ.డి.ఎ. టూల్స్, వీహెచ్‌డీఎల్ లాంగ్వేజ్ వంటి ముఖ్యమైన అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వీటికి సంబంధించిన ప్రాథమిక పరిజ్ఞానం కలిగి ఉంటే, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలో వీఎల్ఎస్ఐ విభాగంలో ఉద్యోగాలు పొందే అవకాశాలు పెరుగుతాయని సూచించారు. అంతేగాక గ్రాడ్యుయేట్స్ తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకొని ఇంటర్వ్యూలలో ఎలా విజయవంతమవ్వాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.ఎం.వి.నారాయణ, ఈసీఈ హెచ్‌ఓడీ డాక్టర్ సీహెచ్ నాగరాజు, డాక్టర్ ఎస్.కరీముల్లా, డాక్టర్ సి.వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా దోపోత్సవం



ప్రత్యేక అలంకరణలో గట్టు వెంకటేశ్వరస్వామి

రామసముద్రం : మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీ గట్టు వెంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారి దోపోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు రామచంద్రభట్టర్ తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే రామసముద్రం దిగువపేటలో వెలసిన శ్రీ చంద్రశేఖరస్వామి ఉత్సవాల్లో భాగంగా గ్రామోత్సవం నిర్వహించారు.

మొదటి రోజు ప్రశాంతం

పది పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మొదటి పరీక్ష కావడంతో అన్ని పరీక్షా కేంద్రాల వద్ద టెన్షన్ వాతావరణం కనిపించింది. విద్యార్థులు తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాయనుండటంతో అనేక మంది తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్షా కేంద్రాల వద్దకు స్వయంగా పిలుచుకొని వచ్చి పరీక్షా కేంద్రంలోపలికి వెళ్లేవరకు గేటు బయటే ఉండి పరీక్ష బాగా రాయి అంటూ చెబుతూ వచ్చారు. పలు పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు చివరి నిమిషాల్లో పరుగు మీద పరీక్షా కేంద్రాలకు చేరుకోవడం కనిపించింది. విద్యార్థులను అరగంట ముందే అధికారులు లోపలికి అనుమతించారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. పలు కేంద్రాలను ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



రాజంపేట టౌన్: విద్యార్థులకు సూచనలు ఇస్తున్న అధికారిణి శోభారాణి



చిన్నమండెం: మోడల్ స్కూల్‌లో హాల్‌టికెట్‌లను చూసుకుంటున్న విద్యార్థులు



రాజంపేట టౌన్: ఆలస్యమవ్వడంతో పరీక్షా కేంద్రంలోకి పరుగుతీస్తున్న విద్యార్థిని



గాలివీడు: పరీక్ష అనంతరం బయటకు వస్తున్న పది విద్యార్థులు



రాజంపేట టౌన్: లోపల విద్యార్థులకు పరీక్ష.. బయట తల్లిదండ్రుల నిరీక్ష



నందలూరు: పరీక్షలకు హాజరైన విద్యార్థులు



సంబేపల్లె: హాల్ టికెట్లను చూసుకుంటున్న దృశ్యం



రైల్వేకోడూరు అర్బన్ ఎగ్జామ్ సెంటర్‌లోకి వెళుతున్న విద్యార్థులు



వీరబల్లి: పరీక్షకు హాజరైన విద్యార్థులు



రామాపురం: ఎగ్జామ్ హాల్‌లోకి వెళ్లేందుకు వేచివున్న విద్యార్థులు



లక్కిరెడ్డిపల్లి : పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తున్న ఏఎస్పీ ఎం.వెంకటాద్రి



సిద్దవటం: పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఒంటిమిట్ట సీఐ బాబు

సబ్సిడీపై యంత్రాలకు దరఖాస్తు చేసుకోండి

పెనగలూరు : వ్యవసాయ యంత్ర పరికరాలు అవసరమున్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి సుబ్రమణ్యం తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలానికి 2024–25 సంవత్సరానికి గాను రాయితీపై వ్యవసాయ పరికరాలు మంజూరయ్యాయని చెప్పారు. మండలానికి 55 పరికరాలు టార్గెట్‌గా ఇచ్చారని, ఈ టార్గెట్‌ను రైతు భరోసా కేంద్రాల వారీగా విభజించి సాధారణ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారీగా టార్గెట్ ఇవ్వడం జరిగిందన్నారు. ఇందులో బ్యాటరీస్ స్ప్రేర్ 8, పవర్ స్ప్రేర్స్ 19, ట్రాక్టర్ పరికరాలు 25, ట్రాక్టర్స్ స్ప్రేర్ ఒకటి, రొటావేటర్ ఒక పరికరం వచ్చాయన్నారు. కావాల్సిన రైతులు పంచాయతీలో రైతు భరోసా కేంద్రంలో సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డులు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్, ట్రాక్టర్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్ తీసుకురావాలన్నారు. మార్చి 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు.

కాశీ విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు

సిద్దవటం : మండలంలోని టక్కోలు గ్రామంలో ఉన్న కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు, హోమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నాగరాజు శర్మ సోమవారం మాట్లాడుతూ ఇక్కడి ఆలయం పురాతనమైందని, గోపురాలు శిథిలావస్థకు చేరడంతో తొలగించి నూతనంగా ఏర్పాటు చేయుటకు స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపామన్నారు. శ్రీరామనవమి అనంతరం ఆలయానికి నూతన గోపురాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శివ శంకర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెలుగు ఏపీఎంపై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డ్వాక్రా సంఘాల మహిళలు

రాయచోటి అర్బన్ : తంబళ్లపల్లె నియోజకవర్గం కొత్తకోట మండలం బడికాయలపల్లె– 4 వీఓ సంఘమిత్ర భారతి పేరును అక్రమంగా ఆన్‌లైన్ నుంచి తొలగించిన ఏపీఎం మురళీపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సాంబశివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘమిత్రగా తిరిగి భారతిని కొనసాగించాలంటూ ఆ సంఘం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నాను నిర్వహించారు. ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ రాజకీయ ఒత్తిళ్ల కారణంగా సంఘమిత్రగా విధులు నిర్వర్తిస్తున్న భారతిని తొలగించడాన్ని తప్పుబట్టారు. ఇందుకు కారణమైన ఏపీఎం మురళీని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అలానే భారతిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని లేకుంటే జిల్లా వ్యాప్తంగా ఆందోళనా కార్యక్రమాలు చేపడతామంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ రాయచోటి కార్యదర్శి ఎస్.శ్రీనివాసులు, ఏఐటీయూసీ జిల్లా ఉపప్రధాన కార్యదర్శి సలీంబాషా, ఉపాధ్యక్షుడు వేణు గోపాల్ రెడ్డి, రాయచోటి కార్యదర్శి బి.వెంకటరమణ, జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు రంగారెడ్డి, సంఘమిత్ర భారతితోపాటు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

హెచ్చరికలు సరే.. చర్యలేవీ?

హైస్కూల్ ప్రవేశం ద్వారం వద్ద ఇబ్బడి ముబ్బడిగా చెత్త కుప్పలు

గాలివీడు : హైస్కూల్ వద్ద చెత్తా చెదారం వేస్తే రూ.1000 జరిమానా విధిస్తామని హెచ్చరికలు జారీ చేస్తూ పంచాయతీ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు దిష్టిబొమ్మను తలపిస్తోంది. మండల కేంద్రంలోని నిత్యం విద్యార్థులతో రద్దీగా ఉండే స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రవేశ ద్వారం ఇప్పుడు డంపింగ్ యార్డును తలపిస్తోంది. కనీసం ఆ పాఠశాలలో చదువుతున్నది తమ పిల్లలేనన్న విచక్షణ మరచిన చుట్టుపక్కల వాళ్లు తమ నివాసాల్లోని చెత్తాచెదారం, దుకాణాలలో వెలువడే వ్యర్థాలు ఇబ్బడి ముబ్బడిగా తెచ్చి పాఠశాల ముందు పడవేస్తున్నారు. అధికారులు కేవలం హెచ్చరిక బోర్డులకే పరిమితం కాకుండా ఆ ప్రాంతంలో నిఘా ఉంచి చెత్త వేస్తున్న వారు ఒకరిద్దరిపై జరిమానా విధిస్తే పరిస్థితి వేరేలా ఉండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. కానీ అధికారులు తీరు ప్రకటనలకు పరిమితవుతున్నారే తప్ప చర్యలకు ఉపక్రమించలేదన్న చులకన భావనతో చుట్టుపక్కల స్థానికులు చెత్తాచెదారం వెయ్యడంలో పోటీ పడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పదవ తరగతి పరీక్షా కేంద్రాల్లో ఈ హైస్కూల్ కూడా ఒక్కటి కావడంతో పరీక్షలు రాసే విద్యార్థులకు ఈ దుర్వాసన బెడద తప్పడం లేదు. విద్యార్థులు ఇన్ని అవస్థలు పడుతున్నా కనీసం ప్రధానోపాధ్యాయులు గానీ ఉపాధ్యాయులు గానీ అటువైపు కన్నెత్తి చూడక పోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



జెడ్పీ పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద చెత్తకుప్ప

వైభవంగా ముగిసిన పాలేటమ్మ జాతర



పాలేటమ్మ ఆలయం వద్ద భక్తుల కోలాహలం



అలంకరణలో పాలేటమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామంలో కొలువైవున్న శ్రీ పాలేటమ్మ జాతర సోమవారంతో వైభవంగా ముగిసింది. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాయచోటి డీఎస్పీ కొండయ్యానాయుడు ఆదేశానుసారం రాయచోటి రూరల్ సీఐ వరప్రసాద్ సూచనలతో చిన్నమండెం ఎస్ఐ సుధాకర్ గట్టి బందోబస్తు నిర్వహించారు. జాతరలో పలు ప్రాంతాల నుంచి వచ్చిన చాందినీబండ్లతో కోలాహలం కనిపించింది.

సీసీ కెమెరాల పర్యవేక్షణలో పది పరీక్షలు

ఓబులవారిపల్లె : పదోతరగతి పరీక్షలు మండల వ్యాప్తంగా పరీక్ష కేంద్రాలలో సోమవారం పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా నిర్వహించడం జరిగింది. ముక్కవారిపల్లి ఏ,బీ సెంటర్‌లలో సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలను జరిపారు. మొదటి పరీక్ష తెలుగు కావడంతో విద్యార్థులు ఉదయం 7 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. తల్లెంవారిపల్లి, ఓబులవారిపల్లి జెడ్పీహెచ్‌ఎస్, ముక్కావారిపల్లి గురుకుల పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండల వ్యాప్తంగా 631 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా ఒక్కరు గైర్హాజరయ్యారు. రైల్వేకోడూరు సీఐ వెంకటేశ్వర్లు ఆదేశాలతో మండల పోలీసులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు.

లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్‌పై ప్రచారం కల్పించండి



రికార్డులను పరిశీలిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్

రాయచోటి టౌన్ : లీగల్ సర్వీసెస్ హెల్ప్‌లైన్ నంబర్ 15100పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ జైల్ అధికారులకు సూచించారు. సోమవారం రాయచోటి సబ్ జైల్‌ను తనిఖీ నిర్వహించారు. పలు రికార్డులను పరిశీలించి సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలకు లీగల్ ఎయిడ్ క్లినిక్ ప్రాధాన్యతను వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే రాయచోటి సబ్ జైల్ సూపరింటెండెంట్, న్యాయవాదులకు తెలియజేయాలన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తాం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్రీధర్ రావు, ఎంపీడీఓ మల్ రెడ్డి

ఓబులవారిపల్లె : ప్రజల నుంచి సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ శ్రీధర్ రావు పేర్కొన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు హాజరై పొలం రాస్తాకు సంబంధించిన సమస్యలు, ఆన్‌లైన్ సమస్యలు ఓల్టా తదితర సమస్యలపై రైతులు, ప్రజలు అర్జీలను అందజేశారు. అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మల్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణమ్మ, మండల సర్వేయర్ నాగలక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై జిప్సం, వేపనూనె

పెద్దతిప్పసముద్రం : రైతులకు రాయితీపై జిప్సం, వేపనూనె అందజేస్తున్నామని ఏవో ప్రేమలత సోమవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలానికి 800 బస్తాల జిప్సం మంజూరైందన్నారు. 50 కిలోల జిప్సంకు రాయితీపోగా రూ.155లకు అందజేస్తామన్నారు. అదే విధంగా లీటర్ వేపనూనె రూ.300లకు, రెండు కిలోల సూక్ష్మ పోషకాల కిట్ రూ.250లకు అందజేస్తామన్నారు.

సీవై టీబీ స్కిన్ పరీక్షలు చేయించుకోవాలి



టీబీ పరీక్షలను పర్యవేక్షిస్తున్న అడిషనల్ డీఎంహెచ్ఓ శైలజ

రాజంపేట రూరల్ : టీబీ వ్యాధిగ్రస్తులతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరూ సీవై టీబీ స్కిన్ పరీక్షలు చేయించుకోవాలని అడిషనల్ డీఎంహెచ్ఓ శైలజ కోరారు. టీబీ స్కిన్ టెస్ట్ ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండల పరిధిలోని కూచివారిపల్లి 1, 2, వరదయ్యగారిపల్లి సబ్ సెంటర్‌లలో సీవై టీబీ స్కిన్ టెస్ట్‌లను చేశారు. శిబిరానికి హాజరైన అడిషనల్ డీఎంహెచ్ఓ శైలజ టీబీ వ్యాధిగ్రస్తుల బంధువులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ స్కిన్ టెస్ట్ ద్వారా టీబీ వ్యాధి ఇన్ఫెక్షన్ ఉందో లేదో తెలుసుకోవచ్చన్నారు. పాజిటివ్ వస్తే 3 నెలలపాటు ప్రభుత్వం ఉచితంగా మందులు ఇస్తుందని తెలియజేశారు. కార్యక్రమంలో టీబీ పర్యవేక్షకులు పిల్లి జయప్రకాష్, ఏఎన్ఎంలు నూర్జాహాన్, కల్పన, ఎంఎల్‌హెచ్ పి.అలీషా, సుప్రియ, ఆశ కార్యకర్తలు సురేఖ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు వసతిగృహం ఏర్పాటు చేయండి

రాయచోటి అర్బన్ : పలు సమస్యలపై రాయచోటి పట్టణానికి విచ్చేసే దివ్యాంగుల కోసం పట్టణంలో ప్రత్యేక వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి విన్నవించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఆయన కలెక్టర్‌తో మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరయ్యే దివ్యాంగులు చీకటి కావడంతో స్వంత గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి ఉంటుందన్నారు. అధికారులు స్పందించి దివ్యాంగుల సహాయార్థం వసతిగృహాన్ని ఏర్పాటు చేయాలంటూ కోరారు. ప్రతి దివ్యాంగుడికి బస్సులలో ఉచితంగా ప్రయాణం, ఆర్థికాభివృద్ధికి వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు దివ్యాంగుల సంఘం నేతలు పాల్గొన్నారు.

అదనపు రుణం కోసం దరఖాస్తు చేసుకోండి



ఫణిరాజకుమారి ఎంపీడీఓ

సిద్దవటం : గృహ హక్కు పథకం కింద అదనపు రుణం కోసం లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఫణిరాజకుమారి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ గృహ హక్కు పథకం ద్వారా ఎస్సీ, బీసీ లబ్ధిదారులకు రూ. 50, 000, ఎస్టీ లబ్ధిదారులకు రూ. 75,000 ఆర్థిక సహాయం ప్రభుత్వం ఇవ్వనున్నట్టు చెప్పారు. అలాగే పథకం కింద నిర్మాణ పనులు చేపట్టిన లబ్ధిదారులకు మాత్రమే బ్యాంకు రుణం మంజూరవుతుందన్నారు. మండలంలో ఇప్పటి వరకు 722 కొత్త హౌసింగ్ దరఖాస్తులు వచ్చాయని, దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరూ కులం, ఆదాయం, అనుబంధ పత్రాలు తీసుకొని అందిస్తే గృహాలు మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు. అలానే ఇళ్లు మంజూరైన వారు 12 నెలల్లో నిర్మాణాలు పూర్తి చేయాలని తెలియజేశారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా హౌసింగ్ ఏఈని సంప్రదించాలని ఆమె కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి



నాగరాజునాయక్, ఏఈ, హౌసింగ్

సుండుపల్లె : గత ప్రభుత్వంలో ఇచ్చిన ప్రభుత్వ పక్కా గృహాలు వివిధ దశలలో పూర్తికాని ఇళ్ల నిర్మాణాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల లబ్ధిదారులకు అదనపు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లుగా గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎం.నాగరాజునాయక్ సోమవారం ఒక ప్రకటన ద్వారా పేర్కొన్నారు. ఇందులో భాగంగా మండలంలో దాదాపు 520 మంది లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందనుందని ఆయన తెలిపారు. ఎస్టీ వర్గానికి చెందిన వారికి రూ.75 వేలు, ఎస్సీ, బీసీ వర్గాల వారికి రూ.50 వేలు అందిస్తున్నట్టు తెలియజేశారు. ఈ నెల 15వ తేదీ నుంచి 23వ తేదీల వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఆర్థికసాయం గురించి తెలియపరిచి దశలవారీగా నిర్మాణంలో ఉన్న ఇళ్లకు ఆర్థిక సహాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి మరింత కృషి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాయచోటి జగదాంబసెంటర్ : పట్టుదలతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తామని రాయచోటి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు అశోక్‌కుమార్, స్టూడెంట్ వింగ్ అధ్యక్షుడు మణికంఠారెడ్డి, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబులు తెలిపారు. రాయచోటిలో ఏర్పాటు చేసిన సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. తమపై ఎంతో నమ్మకంతో పార్టీ పదవుల నియామకానికి సహకరించిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిలకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

థైరాయిడ్ నివారణకు అయోడిన్ తప్పనిసరి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ శేఖర్‌రెడ్డి

సుండుపల్లె : థైరాయిడ్ నివారణకు అయోడిన్ తప్పనిసరి అని రాయవరం పీహెచ్‌సీ డాక్టర్ శేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని మడితాడు జెడ్పీహెచ్‌ఎస్‌లో 6 నుంచి 12 సంవత్సరాల వపు పిల్లలకు ఆయన అయోడిన్ పరీక్షలు చేశారు. అనంతరం వైద్యుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తినే ఆహార పదార్థాలలో సాధారణ ఉప్పును కాకుండా అయోడైజడ్ ఉప్పును 150 మిల్లీ గ్రాములకు తగ్గకుండా వాడాలని తెలిపారు. అయోడిన్ లోపంతో వచ్చే వ్యాధులు, ఇబ్బందుల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ పాలు, పెరుగు, మజ్జిగ, ఆకుకూరలు, మాంసం, చేపలు వంటి ఆహారాన్ని తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వీరనారాయణ, లక్ష్మీప్రసన్న, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.